క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న అప్పారావు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. అచ్యుతాపురంలోని అభిరామ్ హోటల్ అధినేత, హరిపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల బాపునాయుడు కుమారుడు అప్పారావు గురువారం రూ.50 వేలు విరాళంగా ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, మద్దాల వీరునాయుడు, మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కృష్ణ, పిన్నమరాజు రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్టి కొట్టే వేడుక



ఉట్టు కొట్టే కార్యక్రమంలో భక్తులు

మునగపాక: స్థానిక బీసీ కాలనీలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఉట్టుకొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు ఉట్టు కొట్టేందుకు పోటీపడ్డారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

టి.సిరసపల్లి పంచాయతీకి చెత్త రిక్షా అందజేత



చెత్త రిక్షా అందజేస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లి పంచాయతీకి గురువారం రాంబిల్లి మండల పరిధిలోని కొహన్స్ లైఫ్ సెన్సెస్ యూనిట్ ద్వారా చెత్త రిక్షా అందజేశారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆపరేషన్స్ హెడ్ కె.రవికుమార్ పంచాయతీ కార్యదర్శి ఎస్తేర్‌కు అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగి పాలమరశెట్టి వీరప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, మాజీ ఎంపీటీసీ నాగేశ్వరరావు, కూటమి నాయకులు మోహనరావు, గోవింద, ఎస్ఎంసీ చైర్మన్ ఆనందరావు పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు పొందాలి

ఎస్.రాయవరం: గణపతి నవరాత్రుత్సవాలకు విధిగా నిబంధనలు పాటిస్తూ, మండపాలకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ విభీషణరావు గురువారం తెలిపారు. విద్యుత్ అనుమతులు తీసుకున్నప్పటికి లైన్ల కింద మండపాలు వేయకుండా జాగ్రత్త పడాలన్నారు. చవితి మొదలుకుని అనుపోత్సవం నిర్వహించే వరకూ వలంటీర్ల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా పోలీస్ వారు సూచించిన 32 రకాల నిబంధనలు సోషల్ మీడియాలో పొందుపరచారు.

వైభవంగా అమ్మవార్ల పండగలు

యలమంచిలి రూరల్: మండలం, మున్సిపాలిటీలోని పలు గ్రామాల్లో అమ్మవార్ల పండగలు వైభవంగా జరిగాయి. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో మహాలక్ష్మి అమ్మవారు, కొత్త ఎర్రవరం పొలిమేరమ్మతల్లి, షేకిళ్లపాలెం నల్లమారమ్మ, పీఎస్ఆర్ పేట పటాలమ్మ పండగలు సందర్భంగా ఆయా అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. ఆలయాలతో పాటు సమీప ప్రాంతాలను భారీగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

అరకొర బస్సులతో ఇబ్బందులు

అనకాపల్లి టౌన్: స్త్రీ శక్తి పథకంలో అరకొర బస్సులతో మహిళలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, తక్షణమే వాటి సంఖ్యను పెంచాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారులు లైంగిక వేధింపులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ పేరుతో మోసం చేస్తున్నారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, సూర్యప్రభ, యు. నాగమణి, మంగతాయారు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

- ఒకవైపు దమ్ములు మరోవైపు ఉడుపులు
- ఇటీవల కురిసిన వర్షాలతో ఒక్కసారిగా జోరు
- సాగు లక్ష్యం చేరుకుంటుందని అధికారుల అంచనా..



మునగపాకలో వరి ఉడుపులు చేసేందుకు దమ్ము అనంతరం సిద్ధం చేసిన భూమి



వరి ఉడుపులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: అయితే అతివృష్టి–లేకుంటే అనావృష్టి... సీఎం చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. కాలం కలిసి వస్తేనే రైతు బతుకు బట్ట కడుతుంది. లేకుంటే అప్పుల పాలు కావాల్సిందే. గత మూడు పర్యాయాలు ఆయన పాలనలో రైతులకు కడగండ్లు తప్పడం లేదు. ప్రస్తుత పరిపాలనలోనూ మొన్నటి వరకు వర్షాలు లేక ఆకుమడులు ఎండిపోయాయి. దీంతో దిగాలు చెందారు. వర్షాల కోసం వేయి కళ్లతో ఎదురు చూడాల్సిన పరిస్థితులు, నేడు వర్షాలు కురవడంతో వరి ఉడుపులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.

సాగునీటి వనరులకు జలకళ...

మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సాగునీటి కాలువల్లో నీరు వచ్చి చేరుతుంది. ఎగువన కూడా భారీ వర్షాలు కురవడంతో దిగువ ప్రాంతాలకు నీరు ప్రవహిస్తుంది. సాగునీటి వనరుల ఆధారంగా వరిపంట సాగు చేసే రైతుల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోంది. ఆలస్యంగా అయినా వర్షాలు కురవడంతో రైతులు వరిసాగుకు అవసరమయ్యే పనులను చేపడుతున్నారు. పలు సాగునీటి వనరుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు బిజీగా గడుపుతున్నారు.

420 హెక్టార్లకు పైగా వరి సాగు...

మండల వ్యాప్తంగా ఖరీఫ్ వరి సాగు సాధారణ విస్తీర్ణం 1456 హెక్టార్లు. ఇంతవరకు 420 హెక్టార్లకు పైగా సాగు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. నీటి ఆధారం ఉన్న ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే వరి ఉడుపులను పూర్తి చేశారు. ఇతర ప్రాంతాల్లో రైతులు దమ్ములు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఇంటిల్లిపాది వరి సాగుకు అవసరమయ్యే చర్యలు చేపడుతున్నారు. కూలీల సహాయంతో వరి సాగు వేగవంతమయ్యేలా పాటుపడుతున్నారు.

పొలం పిలుస్తోంది ద్వారా రైతులకు అవగాహన...

వరిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అధిక దిగుబడులకు అవసరమయ్యే సలహాలు, సూచనలను రైతులకు అందిస్తున్నారు. నారు చివరలను తుంచి ఉడుపు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయంటూ అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా ఎరువుల వినియోగంపై కూడా జాగ్రత్తలు సూచించడంతో వరిసాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.



తోటాడ త్రిమూర్తుల ఆలయం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

అధికారుల సూచనలతో మంచి ఫలితాలు



ఖరీఫ్ సీజన్ ముగిసేలోగానే ఆశించిన లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితులు ఉన్నాయి. సెప్టెంబర్ నెలాఖరులోగా వరి సాగు పూర్తవుతుంది. వరి సాధారణ విస్తీర్ణం 1456 హెక్టార్లుగా ఉంది. ప్రస్తుతానికి 420 హెక్టార్ల మేర సాగు జరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో వరి సాగుకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. వరి పైరు ఎక్కడైనా ముంపులో ఉంటే నీరు పోయేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు.

సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏవో, మునగపాక

గ్రామాల్లో ఘనంగా మరిడిమాంబ పండగలు



తిమ్మరాజుపేటలో మరిడిమాంబ ఆలయ సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు ధర్మశ్రీ, ప్రసాద్



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో మరిడమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. ఏటా శ్రావణమాసంలో ఈ పండగను గ్రామస్తులు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వెలగా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తోట సత్తిబాబు, గోవిందు, తిరుపతిరావు, పార్టీ నాయకులు బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు ధర్మశ్రీ, ప్రసాద్, ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట, నాగులాపల్లి గ్రామాల్లో మరిడిమాంబ పండగలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని అమ్మవార్లను భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. తిమ్మరాజుపేటలోని అమ్మవారిని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశీబాబు, పిన్నమరాజు రవీంద్రరాజు, జగన్, ఉమ్మలాడ ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. నాగులాపల్లిలోని అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకుజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు,మళ్ల కాలేశ్వరరావు,రాజునాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

కోటవురట్ల: ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే బాగా ఆలస్యం కావడంతో రైతులు తొందరపడుతున్నారు. సాధ్యమైనంత వరకు వరి నాట్లు పూర్తి చేసేందుకు పరుగులు తీస్తున్నారు. మండలంలో గత ఏడాది 1,780 హెక్టార్లలో ఖరీఫ్ వరిసాగు జరిగింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో వరినాట్లు ఆలస్యమయ్యాయి. నారుమడులు ఎండిపోవడం, దమ్ము పట్టేందుకు సాగునీరు లేకపోవడం తదితర కారణాలతో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం కనిపిస్తోంది. చాలా మంది రైతులు ఖరీఫ్ సాగుకు స్వస్తి చెప్పారు. గత ఏడాది లక్ష్యాన్ని చేరుకునే అవకాశం కనిపించడం లేదు. సాగునీటి వసతి ఉన్న ప్రాంతాలలో ప్రస్తుతం జోరుగా వరినాట్లు పూర్తి చేస్తున్నారు. మొత్తంగా ఈ ఏడాది 1,200 హెక్టార్లలో వరి సాగు జరిగే అవకాశం కనిపిస్తోంది.



యండపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

రీసర్వేతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దారు నీరజ

ఎస్.రాయవరం: భూములు రీసర్వే కొలతల వల్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకోవచ్చని డిప్యూటీ తహసీల్దార్ నీరజ్ తెలిపారు. స్థానిక నూకాంబిక ఆలయ మండపంలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. గత ప్రభుత్వంలో మండలంలో ప్రారంభమైన రీసర్వే పనులు ప్రస్తుత ప్రభుత్వంలోనూ వేగవంతం జరుగుతున్నాయన్నారు. నేటి నుంచి కొరుప్రోలు రెవెన్యూలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. భూ సమస్యలు ఉన్న రైతులు ముందుగా తమ దృష్టికి వివరాలు తెలిపినట్టయితే సకాలంలో కొలతలు నిర్వహించి హద్దులు నిర్ణయిస్తామన్నారు. అన్నదమ్ములు పంపకాలు కూడా సక్రమంగా రీ సర్వేలో హద్దులు వేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చేకూరి రామరాజు, కోరా జగదీష్, మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్, స్థానిక నాయకుడు ప్రతిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేబాక సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



రమణ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నేతలు

నక్కపల్లి: మండలంలో రేబాక గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత సాదిరెడ్డి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, తదితరులు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాసరావు తండ్రి రమణ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం రేబాకలో రమణ సంతాప సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, తళ్లా భార్గవ్, సూరకాసుల గోవింద్, సాదిరెడ్డి నారాయణమూర్తి, బచ్చల రాజు, కరణం ఈశ్వరరావు, కాసుబాబు, గొర్ల నరసింహమూర్తి, తదితరులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, కోమర్తి బాబూరావు, కాకార వెంకటరావు, నత్తల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 8 తర్వాతే లారీల లోడింగ్, అన్‌లోడింగ్

పట్టణ కిరాణా వ్యాపారులకు డీఎస్పీ శ్రావణి సూచన



పట్టణ వర్తకులతో డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: వ్యాపారులంతా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ శ్రావణి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ అతిథి గృహంలో పట్టణ హోల్‌సేల్ కిరాణా, ఆయిల్, ట్రాన్స్‌పోర్ట్, కాయగూరలు, బట్టల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తకులు తమ సరుకులు తీసుకువచ్చే లారీలతో రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల లోపు మాత్రమే లోడింగ్, అన్‌లోడింగ్ ఆయా షాపుల వద్ద చేసుకోవాలన్నారు. మిగిలిన సమయాల్లో లారీలు రోడ్లపై కనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి కొంతమంది వర్తకులు కల్పించుకుని మధ్యాహ్నం వేళ సరుకుల లోడింగ్, అన్ లోడింగ్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికే కాయగూరల మార్కెట్ వద్ద డీసీఎంఎస్ స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించామని, భారీ వాహనాలన్నీ అక్కడ నిర్దేశించిన సమయాల్లో మాత్రమే చేసుకోవాలని సమాధానమిచ్చారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పట్టణ, ట్రాఫిక్ సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం వెంకటనాయణ, క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయం



మాట్లాడుతున్న భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్: అన్యాయంగా అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక రింగ్‌రోడ్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ప్రతీ సమస్యపై ప్రజల పక్షాన నిలవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఏవీ పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు.

737 సర్వే సరిహద్దుల పరిశీలన



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

మాకవరపాలెం: రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్ భూముల సరిహద్దులను నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ గురువారం పరిశీలించారు. రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో సుమారు 1605 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దుల ఏర్పాటుకు సర్వే జరుగుతోంది. గురువారం సాయంత్రం ఆర్డీవో చినరాచపల్లి ఊటగెడ్డ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దులను పరిశీలించారు. అనంతరం ఇదే రెవెన్యూలో ఏపీఐఐసీ ఆధీనంలోని 309 ఎకరాల భూమిలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను కూడా ఆయన పర్యవేక్షించారు. పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించడంలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఊటగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించి ఆయకట్టు వివరాలు తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన



కోటవురట్లలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రాంబిల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం



అచ్యుతాపురంలో డీటీ శ్యామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కోటవురట్ల/మునగపాక/అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్: అంగన్‌వాడీ వర్కర్లు కదం తొక్కారు. డిమాండ్ల సాధన కోసం గళమెత్తి నినదించారు. ర్యాలీ చేసి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేశారు. అన్ని మండలాల్లో అంగన్‌వాడీ వర్కర్లు గురువారం ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు నిధుల కేటాయింపు పెంచాలని, ప్రీ స్కూల్‌ను బలోపేత చేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, పనిభారం తగ్గించాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను అనుసరించి గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా పదోన్నతి కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తదితర డిమాండ్లు తెలిపారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మునగపాకలో సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులకు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి వినతి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, జయలక్ష్మి, తులసీలక్ష్మి, సరస్వతి, భవాని తదితరులు పాల్గొన్నారు. రాంబిల్లి మండలంలో తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రం సమర్పించారు. సీహెచ్ రామకృష్ణ, ఎస్.నారాయణరావు, సుజాత, వనజ, కుమారి, తులసి, మంగ తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ కే.సోమునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు వరలక్ష్మి, అంబిక, హేమ, కుమారి, మంగ, యమున, నారాయణమ్మ, భారతి, పద్మ పాల్గొన్నారు.

జిల్లాలో మైనింగ్ మాఫియాపై ఉద్యమిద్దాం

కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఓబీసీ రాష్ట్ర చైర్మన్ నాగరాజు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న శొంఠి నాగరాజు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మైనింగ్ మాఫియా పెరిగిపోయిందని, ఖనిజ సంపదను కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ శొంఠి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్లో పార్టీ జిల్లా ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడా బాబులు, కొంతమంది ఎమ్మెల్యేలు కలసి జిల్లాను ముక్కలుగా చీల్చి నిరంతరం దోపిడీ చేస్తున్నారన్నారు. కొండలు, గుట్టలు, అడవులు నాశనం చేసి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని, ఈ దోపిడీతో జిల్లాలోని సామాన్య ప్రజలకు ఏ ఒక్క రూపాయ ఉపయోగం లేదన్నారు. ఈ అక్రమాల వెనుక ఉన్న వారి పేర్లు బహిరంగం చేస్తామని, ఇక ప్రజలు పక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీసీలను ఓటు బ్యాంకులా వాడుకోవడం పాలకులకు అలవాటు అయిపోయిందన్నారు. ఎన్నికల హామీల అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో జిల్లాలో వివిధ మండలాల ఓబీసీ కో ఆర్డినేటర్లు రాము, ఆనంద్, నారాయణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి లోవరాజు



మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి లోవరాజు

కశింకోట: బాల బాలికలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి. లోవరాజు కోరారు. మత్తు పదార్థాలు, బాల్య వివాహాల నియంత్రణ ఆవశ్యకతపై కశింకోట, తాళ్లపాలెం హైస్కూళ్లు, కశింకోటలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు చేసుకోవాలన్నారు. లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, బాల కార్మికులు, బాలల భిక్షాటన నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల బాలికల్లో స్నేహ పూర్వకమైన వాతావరణం నెలకొనేలా బాలల సంక్షేమ కమిటీలు, రక్షణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాళ్లపాలెం హైస్కూలు హెచ్ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు వేంకటేశ్వరరావు, కల్యాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటు చోరీపై కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



నెహ్రూచౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అనకాపల్లి: దేశంలో వివిధ నియోజకవర్గాల్లో 5 విధాలుగా దొంగ ఓట్లను ఎన్నికల సంఘం సహాయంతో బీజేపీ ప్రభుత్వం ఓటర్ జాబితాలో చేర్పించదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఏబీసీ చైర్మన్ శొంఠి నాగరాజు ఆరోపించారు. స్థానిక విజయరామరాజుపేట నుంచి నెహ్రూచౌక్ వరకూ ఓటు చోర్ గద్దీ చోడ్ నినాదంతో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 పార్లమెంట్ ఎన్నికల తర్వాత వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గంపగుత్తుగా దొంగ ఓట్లు పడ్డాయన్నారు. దొంగ ఓట్లను ఓటర్ల లిస్టుల్లో చేర్చి రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసిందని విమర్శించారు.